

ఊరూరా జాతర

గంగమ్మా.. మము కరుణించమ్మా అంటూ ప్రజలు వేడుకున్నారు. జిల్లా కేంద్రమైన చిత్తూరు మొదలు చిన్న పల్లెల వరకు పలుచోట్ల మంగళవారం గంగ జాతరలు నిర్వహించారు. చిత్తూరు, కుప్పంతో పాటు పలమనేరు, నగరి మండలం వీకేఆర్‌పురం, పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లి, గుడిపాల మండలం 197 రామాపురం, పూతలపట్టు, పులిచెర్ల మండలం కల్లూరు, జీడీనెల్లూరు దళితవాడతోపాటు పలు గ్రామాల్లో గంగమ్మ జాతర జరిగింది. కొన్ని చోట్ల అంబళ్లు పోసి.. మరికొన్ని చోట్ల జంతుబలులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.



అమ్మవారి ఖండిత శిరస్సు ఊరేగింపునకు పోటెత్తిన భక్తజనం



చిత్తూరులో నడివీధి గంగమ్మ విశ్వరూప దర్శనం

కుప్పం.. పోటెత్తిన భక్తజనం

కుప్పంలో శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరకు జనం పోటెత్తారు. అమ్మవారి ఖండిత శిరస్సు ఊరేగింపులో ఇసుకేస్తే రాలనంతగా జనం పాల్గొన్నారు. మంగళవారం ఉదయం గంగబావి దగ్గర వంశపారంపర్య పూజారులు అమ్మవారి శిరస్సుకు పూజలు నిర్వహించారు. అమ్మవారి కండ తెర తొలగించి కర్పూర నీరాజనాలు సమర్పించారు. అక్కడినుంచి అమ్మవారి శిరస్సు ఊరేగింపు ప్రారంభమైంది. గంగమ్మ ముందు, వెనుకల భక్తజనం అనుసరిస్తుండగా, పచ్చ గరిగె మున్ముందు సాగుతుండగా ఊరేగింపు వైభవోపేతమై కనిపించింది. గంగమ్మ శిరస్సు ఊరేగింపు నేతాజీరోడ్డు చివరకు చేరుతుండగా వాన ప్రారంభమైంది. అయినా జనం లెక్కచేయలేదు. వీధులలోనూ, ఇళ్ల వద్దా నిలబడి అమ్మను దర్శించుకున్నారు. జంతు బలులిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం మొదలైన అమ్మవారి శిరస్సు ఊరేగింపు, అర్ధరాత్రి దాటేవరకు కొనసాగి, చివరకు ఆలయానికి చేరుకుంది. మొక్కులున్న భక్తులు వివిధానేక వేషాలు వేసుకుని అమ్మవారి శిరస్సును దర్శనం చేసుకున్నారు. కాగా, మొండెంతో తెర వెనుకనే ఉండిపోయిన అమ్మవారు, ఈ జాతర వారం రోజులుగా తెర ముందుకు వచ్చి శిరస్సు భాగంలో వేప మండలు ధరించి పూజలందుకున్నారు. కాగా, మంగళవారమంతా ఊరేగింపుగా సాగిన అమ్మవారి ఖండిత శిరస్సు.. ఆలయానికి చేరుకోగానే శాంతిపూజలు నిర్వహిస్తారు. అనంతరం శిరస్సును అమ్మవారి అసంపూర్ణ దేహంపై అమరుస్తారు. ఇలా.. బుధవారం భక్తులకు అమ్మవారి విశ్వరూప దర్శనం కల్పిస్తారు. దీంతో రెండు రోజుల కుప్పం జాతర ముగుస్తుంది. జాతర సందర్భంగా కుప్పంలో ఎటు చూసినా భక్తజనమే కనిపిస్తున్నారు.

\- కుప్పం

చిత్తూరులో వైభవోపేతం

అంబలి బిందెలను నెత్తిన పట్టుకుని.. వేపాకు చుట్టుకుని భక్తులు మంగళవారం చిత్తూరులోని నడివీధి గంగమ్మను దర్శించుకున్నారు. ఇలా వచ్చే భక్తులతో నగరంలో గంగజాతర సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల్లోనూ అమ్మవార్లను కొలువుదీర్చి.. జాతర నిర్వహించారు. గంగజాతర సందర్భంగా వీధులన్నీ వేపాకు తోరణాలతో కళకళలాడాయి. ఈ గంగజాతర గత వారం జరగాల్సి ఉంది. అయితే, ఎన్నికల నేపథ్యంలో ఈ వారం నిర్వహిస్తున్నారు. వేకువజామున వంశ పారంపర్య ధర్మకర్తలు సీకే బాబు కుటుంబీకులు పొన్నియమ్మ ఆలయం నుంచి ఊరేగింపుగా వచ్చి నడివీధి గంగమ్మకు మంగళహారతి ఇచ్చారు. అమ్మవారి ముసుగు తీసి భక్తులకు దర్శనం కల్పించారు. సీకేబాబు దంపతుల తొలిపూజతో జాతర మొదలైంది. అమ్మవారికి మేకను బలిచ్చి ఆ రక్తాన్ని భక్తులకు పంపిణీ చేశారు. వందలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని అంబలి నైవేద్యాన్ని సమర్పించారు. ప్రత్యేక బెల్లం పాగు పెనాలలో నింపిన అంబలిని పరిసర మండలాల రైతులు ఎప్పటి కప్పుడు బిందెలతో తీసుకెళ్లారు. తమ పొలాల్లో అంబలిని చల్లి ఈ ఏడాది పంటలు బాగా పండాలని కోరుకున్నారు. ఇక, ఉత్సవ ధర్మకర్త సీకే లావణ్య అమ్మవారి పసుపు కుంకుమను భక్తులకు పంపిణీ చేశారు. అమ్మవారి దర్శనానికి

\- చిత్తూరు కల్చరల్



కాళికాదేవి వేషంలో..





బెల్లంపాగు పెనాల్లో అమ్మవారికి నైవేద్యంగా అంబలి సమర్పణ

అంబళ్లు పోసి..

గడిపాల మండలం 197 రామాపురంలో గంగమ్మను గరిగెరూపంలో ప్రతిష్ఠించారు. అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

\- గుడిపాల





గంగమ్మ శిరస్సు ఊరేగింపు

పలమనేరులో జాతర సందర్భంగా సోమవారం అర్ధరాత్రి తర్వాత గంగమ్మ శిరస్సును ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి తీసుకొచ్చారు. మంగళవారం తెల్లవారుజామున గంగశిరస్సును ప్రతిష్ఠించి.. భక్తులకు దర్శనం కల్పించారు. బుధవారం ఉదయం జరిగే జలది ఉత్సవంతో గంగజాతర ముగియనుంది.

\- పలమనేరు

గంగమ్మకు పొంగళ్లు

పెనుమూరు మండలం ఉగ్రాణంపల్లిలో మంగళవారం ముత్తిగంగమ్మ జాతర నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.

\- పెనుమూరు



వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిపై కేసు

వెదురుకుప్పం, మే 21: గంగాధరనెల్లూరు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిపై కేసు నమోదైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలింగ్ రోజున కృపాలక్ష్మి చెప్పు చూపించి, అసభ్యకరంగా మాట్లాడి, బెదిరించినట్లు వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె పంచాయతీ దేవళంపేటకు చెందిన బాష్యం సతీష్ నాయుడు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 15న కృపాలక్ష్మి, ఆమె వర్గీయులపై కేసు నమోదైంది. విచారణ జరుగుతున్నట్లు మంగళవారం నగరి డీఎస్పీ కేఎస్‌మూర్తి తెలిపారు.

టీడీపీ నేతలపైనా కేసు: దేవళంపేట పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ నేత, సాఫ్ట్‌వేర్ బాష్యం సతీష్‌నాయుడు, అతడి వర్గీయులు తనను కులం పేరుతో దూషించి, దౌర్జన్యానికి పాల్పడ్డారని కృపాలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టీడీపీ నేతలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దీనిపై ఈ నెల 13వ తేదినే కేసు నమోదైందని డీఎస్పీ కేఎస్ మూర్తి మంగళవారం చెప్పారు.

ఐదుగురు కౌంటింగ్ అబ్జర్వర్ల నియామకం

చిత్తూరు కలెక్టరేట్, మే 21: ప్రస్తుతం కౌంటింగ్ నేపథ్యంలో ఐదుగురు అబ్జర్వర్లను నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు బీకే మమత, చిత్తూరుకు షాధిక్ ఆలాం, గంగాధరనెల్లూరు, పూతలపట్టులకు అకౌరి శశాంక్ సిన్హా, నగరికి భరత్ భూషణ్, పుంగనూరుకు ఎస్ మన్నెకిరి కవితను నియమించారు. వచ్చే నెల 4జూ జరగనున్న ఓట్ల లెక్కింపులో వీరు పాల్గొంటారు.

నగరిదే తొలి ఫలితం

- ఈ నియోజకవర్గం బరిలో ఏడుగురు అభ్యర్థులే
- పోలింగ్ కేంద్రాలూ 231 మాత్రమే
- ఓటర్ల సంఖ్యా తక్కువే
- ఆ తర్వాత ఫలితాలు చిత్తూరు, పుంగనూరులదే

చిత్తూరు కలెక్టరేట్, మే 21: ఓట్ల లెక్కింపు తేదీ దగ్గరపడుతుండడంతో అందరిలోనూ టెన్షన్ నెలకొంది. అటు అభ్యర్థులు, ఇటు ప్రజల్లోనూ ఒక్కటే పరిస్థితి. తాము గెలవాలని అభ్యర్థులు, ఓటేసిన అభ్యర్థి గెలవాలని ఓటర్లు నిత్యం జూన్ 4వ తేదీకోసం రోజులు లెక్కిస్తున్నారు. కాగా జిల్లాలో ఎన్నికలు జరిగిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలి ఫలితం వెలువడేది నగరిదే. ఇందుకు ప్రధాన కారణం.. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పోలిస్తే నగరిలోనే ఓటర్ల సంఖ్య తక్కువగా ఉంది. ఇక్కడ ఓటర్ల సంఖ్య 2,02,574. అందుకు తగ్గట్లే తక్కువగా 231 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. దీంతో ఆయా నియోజకవర్గాలతో పోల్చితే ఒక రౌండ్ ముందుగానే ఓట్ల లెక్కింపు పూర్తయ్యి ఫలితం వెలువడనుంది. పైగా ఇక్కడ అభ్యర్థులు కేవలం ఏడుగురే కావడంతో ఈవీఎంలో ఓట్ల లెక్కింపులకు కూడా తక్కువ సమయం తీసుకుంటుంది. అందుకని పది గంటల ప్రాంతంలోనే ఫలితం రావొచ్చని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఓట్ల లెక్కింపు సందర్భంగా కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఏ పార్టీ అభ్యర్థి తొలుత జెండా ఎగురవేస్తారన్నది తేలిపోతుంది. ఇక, ఎనిమిది మంది అభ్యర్థులతో 265 పోలింగ్ కేంద్రాలు కలిగి 2,38,868 మంది ఓటర్లున్న పుంగనూరు.. 13మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ అతి తక్కువగా 226 పోలింగ్ కేంద్రాలు కలిగి 2,02,850 మంది ఓటర్లు ఉన్న కారణంగా చిత్తూరు ఫలితాలు కూడా ఆ తర్వాత 15 నిమిషాల వ్యవధిలో వెలువడనున్నాయి. ఇక, అత్యధిక (14 మంది) అభ్యర్థులు, 288 పోలింగ్ కేంద్రాలు, 2,67,896 మంది ఓటర్లు కలిగిన పలమనేరు నియోజకవర్గం ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దీని ఫలితం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో వెలువడొచ్చని అధికారులు అంటున్నారు. 11మంది అభ్యర్థులు, 256 పోలింగ్ కేంద్రాలు, 2,04,949 ఓటర్లు కలిగిన గంగాధరనెల్లూరు ఫలితాలు, 12 మంది అభ్యర్థులు, 262 పోలింగ్ కేంద్రాలు, 2,20,999 ఓటర్లు కల్గిన పూతలపట్టు ఫలితాలు, 13 మంది అభ్యర్థులు, 243 పోలింగ్ కేంద్రాలు, 2,25,775 ఓటర్లు కల్గిన కుప్పం ఫలితాలు సుమారు 11 గంటల మధ్య వెలువడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.



చిత్తూరులో మంగళవారం కురుస్తున్న వర్షం

17 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 21: గడిచిన 24 గంటల్లో 17 మండలాల్లో తేలిక పాటి నుంచి బలమైనవర్షం కురిసింది. వెదురుకుప్పంలో 44.4, గుడుపల్లెలో 25.2, కుప్పంలో 24, రామకుప్పంలో 20.2, శాంతిపురంలో 13.4, విజయపురంలో 10.2, పుంగనూరులో 8.6, చౌడేపల్లెలో 8.4, పెనుమూరులో 5.8, కార్వేటినగరంలో 4.6, రొంపిచెర్లలో 4.4, తవణంపల్లెలో 4, నింద్రలో 3.6, బంగారుపాళ్యంలో 3.2, పులిచెర్ల, జీడీ నెల్లూరుల్లో 3, పూతలపట్టులో 1.0 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది.





వేడుకగా తిరుపతి జాతర

● వజ్రకిరీటంలో వెలిగిపోయిన గంగమ్మ
● నేడు విశ్వరూప దర్శనం

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఊరంతా జాతర చేసుకుంది. అమ్మలగన్న అమ్మకు పొంగళ్లు పెట్టుకుని ప్రణమిల్లింది. అంబళ్లు పోసి తాపం తీర్చింది. కోర్కెలు తీర్చే కొంగు బంగారాన్ని కళ్లకద్దుకుని భక్తి పారవశ్యంతో చిందేసింది.వారం పాటు రోజుకో అలంకరణతో దర్శనమిచ్చిన తాతయ్యగుంట గంగమ్మకు మంగళవారం ఉదయాత్పూర్వం మహాభిషేకం చేసి శాంతింపజేశారు. స్వల్ప తోపులాట మినహా మహాభిషేక కార్యక్రమం ప్రశాంతంగా సాగింది. సర్వాలంకారశోభితురాలైన గంగమ్మకు అర్చకులు వజ్రకిరీటధారణ చేశారు.అభిషేకానంతర దర్శనం మొదలుకొని నిర్విరామంగా గంగమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.అర్ధరాత్రి నుంచే కొందరు భక్తులు పొర్లుదండాలు, అడుగడుగు దండాలు పెట్టుకుంటూ, వేషాలు వేసుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.టీపీ ఏరియాలోని తాళ్లపాక పెదగంగమ్మ, చింతల చేనులోని ముత్యాలమ్మ, దాసరిమఠంలోని మాతమ్మ, పల్లెవీధిలోని వేశాలమ్మ, చింతకాయవీధిలోని కరిమాను గంగమ్మలతోపాటు నగరంలో వున్న చిన్న గంగమ్మ ఆలయాల్లో కూడా జాతర సంబరాలు అంబరాన్నంటాయి.మంగళవారం భక్తులు పలు పౌరాణిక, జానపద వేషాలు ధరించి అమ్మవార్లను దర్శించుకున్నారు. గత ఏడాదికన్నా ఈసారి సప్పరాలు ధరించిన భక్తులు పెద్దఎత్తున కనిపించారు. నగరంలో ఎక్కడ చూసినా అంబళ్ల పంపిణీ, అన్నదాన వితరణ కార్యక్రమాలు విరివిగా జరిగాయి.మంగళవారం అర్ధరాత్రి తర్వాత విశ్వరూప స్థూపానికి అమ్మవారి విశ్వరూపం తయారు చేయడం మొదలుటపెట్టారు. బుధవారం తెల్లవారుజామున చెంపనరుకుడుతో గంగజాతర పరిసమాప్తి కానుంది.

విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా

పాలసముద్రం, మే 21: మండలంలోని పాలసముద్రం, వెంగళరాజుకుప్పం, వనదుర్గాపురం, నరసింహాపురం అటవీ ప్రాంతాలకు సమీపంలోని చెరువులు, అక్కడి నుంచి వచ్చే కాలువల్లో వున్న ఇసుకను గత వారం రోజులుగా విచ్చలవిడిగా కొందరు ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అటవీ ప్రాంతాల్లోని ట్రాక్టర్ ఇసుకను రూ.3500 చొప్పున విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఎన్నికల అనంతరం పాలసముద్రం ఎస్ఐకి చిత్తూరులోని కౌంటింగ్ కేంద్రం వద్ద బందోబస్తు డ్యూటీ వేయడంతో ఇక్కడ కొంతమంది వైసీపీ నాయకులు ట్రాక్టర్ల ద్వారా అటవీ ప్రాంతాలు, చెరువుల్లో ఇసుకను విక్రయించి పబ్బం గడుపుకుంటున్నారు. అడ్డదారుల్లో తమిళనాడుకు తరలించేస్తున్నారు. పోలీసులు, ఫారెస్టు, రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక అక్రమ రవాణా అడ్డూ అదుపు లేకుండా జరుగుతోంది. కాలువల్లో ఉన్న ఇసుకను తీసివేయడం వల్ల భూగర్భజలాల మట్టం తగ్గిపోతోందని రైతులు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చిత్తూరులో రెండు రోజులు మద్యం దుకాణాల బంద్

చిత్తూరు సిటీ, మే 21: గంగజాతర సందర్భంగా మంగళ, బుధవారాల్లో చిత్తూరులో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతవేస్తున్నట్లు ఎక్సైజ్ ఈఎస్ ఆయేషా బేగం చెప్పారు. గంగమ్మ జాతర సందర్భంగా ఎలాంటి ఘర్షణలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు. నగర పరిధిలోని 14 మద్యం దుకాణాలు, 7 బార్లు, ఒక ఎలైట్ స్టోర్, ఒక మిలిటరీ క్యాంటీన్‌ను ఈ రెండు రోజులు మూసివేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు: బీసీవై



చిత్తూరు సిటీ, మే 21: తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై పోలీసులు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ ఆరోపించారు. ఇటీవల పుంగనూరు నియోజకవర్గంలో బీసీవై పార్టీ శ్రేణులపై వైసీపీ నేతలు దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి చిత్తూరులోని జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న బీసీవై నేతలు, కార్యకర్తలను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో వైసీపీ గూండాలు తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై దాడులు చేశారన్నారు. కానీ, పోలీసులు దెబ్బలు తిన్న వారిపైనే కేసులు పెట్టడం దారుణమన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా పుంగనూరు నియోజకవర్గంలోని పోలీసులు పూర్తిగా మంత్రి పెద్దిరెడ్డికి సహకరించారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలపైన ఐదేళ్లుగా తప్పుడు కేసులు బనాయించి వారిని భయాందోళనకు గురిచేస్తున్నారని చెప్పారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత కూడా పోలీసులు అదే విధానాన్ని కొనసాగిస్తున్నారన్నారు. ఈ సంఘటనలపై న్యాయపోరాటం చేస్తామని ఆయన చెప్పారు.

నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌కు అదనపు ఏసీ కోచ్‌లు

తిరుపతి(సెంట్రల్), మే 21: తిరుపతి- లింగంపల్లి- ముంబాయి మధ్య నడుస్తున్న నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌ల(12733-12734, 17057-17058)కు అదనంగా రెండు 3ఏసీ కోచ్‌ను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల 27వ తేదీవరకు ఈ అదనపు కోచ్‌లు ఉంటాయన్నారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

కౌంటింగు నాడు అల్లర్ల ముప్పు?
ఇంటెలిజన్స్ హెచ్చరికలతో అప్రమత్తం

తిరుపతి(నేరవిభాగం), మే 21: సార్వత్రిక ఎన్నికల్లో పోలింగు రోజు, మరుసటి దినం జిల్లాలోని పలు ప్రాంతాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. అదే తరహాలో జూన్ 4వతేది ఓట్ల లెక్కింపు రోజున కూడా అల్లర్లు జరిగే అవకాశం వుందని ఇంటెలిజన్స్ వర్గాలు హెచ్చరించాయి.ప్రధానంగా చంద్రగిరి నియోజకవర్గంలోని కూచువారిపల్లె, రామిరెడ్డిపల్లె, నడవలూరు, రామాపురం, బ్రాహ్మణకాల్వ, నెన్నూరు గ్రామాలతో పాటు తిరుపతిలోని ఎస్టీవీ నగర్, చెన్నారెడ్డి కాలనీ, అంబేడ్కర్ నగర్, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో అల్లర్ల ముప్పు పొంచి ఉన్నట్లు హెచ్చరించడంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. అల్లర్లకు ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేయడంతో పాటు రౌడీషీటర్లను, పాత నేరస్తులను బైండోవర్ చేయించే పనిలోపడింది.కౌంటింగ్ పూర్తయిన వారం రోజుల పాటు ఈ పికెట్లు కొనసాగిస్తామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు చెప్పారు. అల్లర్లు జరిగే ప్రాంతాలకు త్వరితగతిన చేరుకునేందుకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూడిన నాలుగు మొబైల్ క్విక్ రెస్పాన్స్ టీములను సిద్ధం చేశారు. మరో వైపు ఎన్నికల ఫలితాలు వచ్చాక విజయోత్సవ ర్యాలీలపై నిషేధం విధించారు.

ఘనంగా తరిగొండ వెంగమాంబ జయంతి


వెంగమాంబ చిత్రపటానికి పుష్పాంజలి

తిరుపతి (కల్చరల్), మే 21: అన్నమాచార్య కళామందిరంలో వెంగమాంబ జయంతి వేడుకలు మంగళవారం మొదలయ్యాయి. ప్రారంభ సభలో పాల్గొన్న టీటీడీ జేఈవో గౌతమి మాట్లాడుతూ.. శ్రీవారిని సేవించిన వెంగమాంబ మనకు ఎనలేని సాహితీ సంపదను అందించారని చెప్పారు. అనంతరం జరిగిన సాహితీ సభకు విశ్రాంత వీసీ ఆచార్య కుసుమ కుమారి అధ్యక్షత వహించగా, పలు అంశాలపై ఎస్వీబీసీ అధ్యక్షుడు సాయికృష్ణయాచేంద్ర, నెల్లూరుకు చెందిన సాహితీవేత్త డాక్టర్ లోకేశ్వరి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ ప్రసంగించారు. సాయంత్రం సాయికృష్ణయాచేంద్ర ఆధ్వర్యంలో వెంగమాంబ సంగీత గేయధార జరిగింది.

నేడు తిరుమలలో జయంత్యుత్సవాలు

తిరుమల, ఆంధ్రజ్యోతి: వెంగమాంబ జయంత్యుత్సవాలు బుధవారం తిరుమలలో వైభవంగా జరగనున్నాయి. మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారిణి బుల్లెమ్మ బృందం వెంగమాంబ సంకీర్తనలు ఆలపించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి సమర్పిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు వెంగమాంబ సంకీర్తనల గోష్ఠిగానం.. 7 గంటలకు విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద అనుగ్రహభాషణం చేస్తారు.

ఇసుక అక్రమ రవాణాపై కేసులు పెట్టాలి : జేసీ


ఉత్తరబ్రాహ్మణపల్లెలో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న జేసీ

తవణంపల్లె/పూతలపట్టు, మే 21: నదులు, వంకలు, వాగుల నుంచి ఇసుకను అక్రమంగా తరలించే వారిపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్ఏలు కేసులు పెట్టాలని జేసీ పి.శ్రీనివాసులు సూచించారు. తవణంపల్లె మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె వద్ద బాహుదానదిలో, పూతలపట్టు మండల వావిల్‌తోట వద్ద నీవానదిలోని ఇసుక రీచ్‌లను మంగళవారం ఆయన పరిశీలించారు. గతంలో ఇసుక రీచ్‌లకు ఇచ్చిన అనుమతులు గడువు ముగిసిందని, ఇక ఎవరైనా ఇసుకను తరలిస్తే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజు రెండు సార్లు ఇసుక రీచ్‌లను స్థానిక అధికారులు పరిశీలించాలన్నారు. ఇసుక ఆక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్ఏలపై ఉందన్నారు. అలాగే, వంకలు, వాగులు, నదుల్లో వేస్టేజీ వేయనీకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఇన్‌ఛార్జి, ఏఎస్పీ సుబ్బరాజు, భూగర్భ గనులశాఖ డీడీ కెఎల్ఎం ప్రసాద్, జియాలజిస్టు పోలిరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నడింపల్లెలో అతిసార

ఆస్పత్రికి పరుగు తీసిన బాధితులు ● గ్రామంలో వైద్య శిబిరం


గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి చికిత్సలు చేస్తున్న ఆరోగ్య సిబ్బంది


పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

శాంతిపురం, మే 21 : శాంతిపురం మండలం నడింపల్లె గ్రామంలో మంగళవారం మధ్యాహ్నం పలువురు అస్వస్థతకు గురయ్యారు. కుప్పం గంగజాతరకు వెళ్లే హడావిడిలో ఉన్న పలువురికి వాంతులు, విరేచనాలు అయ్యాయి. ఒకరిద్దరికే అనుకుని ఎవరూ పెద్దగా పటించుకోలేదు. కొంతసేపు గడిచాక మరికొందరికీ వాంతులు, విరేచనాలు అయ్యాయి. దీంతో బాధితులు భయపడి కుప్పం ప్రైవేటు ఆస్పత్రికి కొందరు, శాంతిపురంలోని ప్రభుత్వాస్పత్రికి మరికొందరు వెళ్లారు. శాంతిపురంలో కృష్ణమూర్తి, గోవిందప్ప, రవి, క్రిష్ణప్ప, ఎల్లమ్మ, కదిరమ్మ, మునెమ్మ, గోపాల్ తదితరులు చికిత్స పొందారు. ఎటువంటి ప్రమాదము లేదని తెలియడంతో ఇళ్లకు చేరుకున్నారు. గ్రామంలో అతిసారం విషయం తెలిసి రాళ్ళబూదుగూరు ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అస్వస్థతకు గురైన వారిని డాక్టర్లు పలకరించి చికిత్స అందించారు. సర్పంచి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ చేశారు. తాగునీటిని పరీక్ష తిరుపతి ల్యాబ్‌కు పంపినట్లు సర్పంచి తెలిపారు. చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి డాక్టర్ అనిల్‌కుమార్, సిబ్బంది గ్రామంలో పర్యటించారు. బాధితులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు.

పల్లెల్లో ఏనుగుల బీభత్సం




ఏనుగులు విరిచేసిన మామిడిచెట్లు - ధ్వంసం చేసిన రాతి కూసాలను చూపుతున్నరైతు

కల్లూరు, మే 21: పులిచెర్ల మండలంలోని కల్లూరు, పాళెం, దేవళంపేట పంచాయతీల్లో సోమవారం రాత్రి పంటపొలాలపై ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించాయి. మామిడి, కొబ్బరి, అరటి, పశుగ్రాసం తదితర పంటలకు అపార నష్టం కలిగించాయి. సోమవారం రాత్రి అటవీ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపు కల్లూరు సమీపంలోని ఎద్దులవారిపల్లి వద్దకు చేరుకుని లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, సారధికి చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. సుమారు 5 టన్నుల మామిడికాయలను నేలరాల్చాయి. అక్కడి నుంచి కోటపల్లి సమీపానికి చేరుకున్న ఏనుగులు యుగంధర్‌కు చెందిన మామిడిచెట్లను, తోట ఇనుప కూసాలను ధ్వంసం చేశాయి. అనంతరం కుమ్మరిపల్లి వద్దకు చేరుకున్న ఏనుగుల గుంపు చంద్రబాబుకు చెందిన మామిడి, కొబ్బరి, అరటి పంటలను విరిచేశాయి. అక్కడి నుంచి కొక్కువారిపల్లి వద్దకు చేరుకుని.. సరస్వతమ్మ, వీకే పల్లికి చెందిన సురేంద్ర, ఎంఎం రాచపల్లికి చెందిన జగన్‌కు చెందిన తోటల్లోని మామిడిచెట్లను విరిచాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. బాధిత రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చి

సూళ్లూరుపేటలో రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం


ఎ.రంగంపేటలోని ఓ ఇంట్లో సోదాలు

తిరుపతి, మే 21 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో మంగళవారం పలు చోట్ల పోలీసులు కార్డన్ సెర్చి పేరిట తనిఖీలు చేపట్టారు. గత 13వ తేదీన పోలింగ్ రోజు, మరుసటి రోజు పలుచోట్ల హింసాత్మక ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. వచ్చే నెల 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నందున ఆ సందర్భంగా కూడా హింస చెలరేగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించిన నేపథ్యంలో ముందు జాగ్రత్తచర్యగా పోలీసులు ఈ తనిఖీలు చేపట్టారు. ఆ క్రమంలో గూడూరు పట్టణం గాంధీనగర్, ఇందిరానగర్, చవటపాలెం, టిడ్కో ఇళ్ళ సముదాయం తదితర ప్రాంతాలను పోలీసు బలగాలు చుట్టుముట్టి విస్తృత తనిఖీలు చేపట్టాయి.ఉదయం 8 గంటల నుంచీ 10 గంటల వరకూ దాదాపు ఇల్లిల్లూ గాలించారు. సరైన పత్రాలు లేని మూడు ఆటోలు, 30 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సూళ్ళూరుపేట పట్టణం సూళ్లూరు ప్రాంతాన్ని పోలీసులు కార్డన్ సెర్చిలో భాగంగా జల్లెడ పట్టారు. ఉదయం 6 గంటల నుంచీ 9 గంటల వరకూ తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎలాంటి పత్రాలూ లేని ఏడు బైక్‌లు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఓ ఇంట్లో రెండున్నర కిలోల గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని ఓ మహిళ సహా ముగ్గురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్టు సమాచారం. ఇక నాయుడుపేట పట్టణం ఎన్ఎస్ఆర్ కాలనీలో వేకువజామున 5.30 గంటల నుంచీ ఉదయం 7.30 గంటల వరకూ కార్డన్ సెర్చిలో భాగంగా పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ ప్రాంతంలో దౌర్జన్యకర వాతావరణం నెలకొని వుంటుందని, గంజాయి అమ్మకాలు కూడా జరుగుతుంటాయని సమాచారం. అయితే పోలీసు తనిఖీల గురించి ముందే సమాచారం లీక్ కావడంతో అసాంఘిక శక్తులు అప్రమత్తమయ్యాయని, అందుకే అనుమానితులు ఎవరూ పట్టుబడలేదని తెలిసింది. చంద్రగిరి మండలం ఎ.రంగంపేట గ్రామంలో పోలీసు బలగాలు తెల్లవారుజామున 5 గంటల నుంచీ 7 గంటల వరకూ ఇల్లిల్లూ తనిఖీ చేశాయి. అయితే అనుమానితులు గానీ, ఇతరత్రా నిషేధిత వస్తువులు గానీ, పత్రాలు లేని వాహనాలు గానీ పట్టుబడలేదు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన ఎస్పీ


స్ట్రాంగ్ రూము వద్ద సీసీ కెమెరాలను పరిశీలిసున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, మే 21: చిత్తూరులోని ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచిన ఈవీఎంలను మంగళవారం ఎస్పీ మణికంఠ చందోలు పరిశీలించారు. వర్షాల కారణంగా స్ట్రాంగ్‌రూముల స్థితిగతులను చూశారు. వర్షపు నీరు స్ట్రాంగ్‌రూముల్లోకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం సీసీ కెమెరాలను పరిశీలించి, విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏఎస్పీ అరీఫుల్లా, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఆర్ఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎస్పీ రవిమనోహరాచారి బాధ్యతల స్వీకరణ



తిరుపతి(నేరవిభాగం), మే 21: తిరుపతి డీఎస్పీగా రవిమనోహరాచారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఈస్ట్, వెస్ట్, యూనివర్సిటీ, అలిపిరి సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది స్వాగతం పలికారు. కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని, అన్ని ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి, సంఘ విద్రోహక శక్తులకు తావు లేకుండా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఈ సందర్భంగా తెలిపారు. ఈ విషయంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మీడియా సిబ్బంది సహకరించాలన్నారు. అలాగే అలిపిరి సీఐగా రామారావు మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రాబోయేది కూటమి ప్రభుత్వమే : అమర్


మాట్లాడుతున్న అమరనాథరెడ్డి, హాజరైన శ్రేణులు

వి.కోట, మే 21: రాబోయేది కూటమి ప్రభుత్వమేనని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. వి.కోట వీఎంఆర్ కళ్యాణ మండపంలో మంగళవారం జరిగిన టీడీపీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పనిచేసిన నాయకులకు, శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. జూన్ 4న కూటమి పార్టీలకే అనుకూల ఫలితాలు వస్తాయన్నారు. పలమనేరు నియోజకవర్గంలో సైతం తెలుగు దేశం జెండా ఎగురుతుందన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావడం ఖాయమన్నారు. పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రంగనాథ్, కార్యదర్శి ఈశ్వర్, ఏఎంసీ చైర్మన్ రామచంద్రనాయుడు, నాయకులు రాంబాబు, చౌడప్ప, ధీరజ్, శబరీష్, నాసీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



బైరెడ్డిపల్లె, మే 21 : మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు మురళీకృష్ణాచార్యులు స్వామివారికి ప్రత్యేకపూజలు చేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి చిన్నపురం మునిపాపిరెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త నారాయణ మొదలి, కమిటీసభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అధికారంలోకి వస్తున్నాం: అమర్

బైరెడ్డిపల్లె, మే 21 : జూన్ 4న అధికారంలోకి వస్తున్నామని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బైరెడ్డిపల్లెలో మంగళవారం జరిగిన టీడీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పడి కష్టానికి తగిన గుర్తింపునిస్తామన్నారు. అందరికీ ధన్యవాదాలు తెలి యజేశారు. అనంతరం నాయకులు అమరనాథరెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్ర మణ్యం శెట్టి, మాజీ ఎంపీపీ కృష్ణవేణి, నాయకులు జయకుమార్, రఘుచంద్రగుప్తా, అమర నాథరెడ్డి, చంద్రారెడ్డి, నాగరాజు, భువనచంద్రగౌడు, గోవిందస్వామి, అమీర్, బాబు పాల్గొన్నారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన.. యువకుడి అరెస్టు

పుంగనూరు, మే 21: పుంగనూరులో బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించడమే గాక ఆ బాలిక తండ్రిపై దాడిచేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. పుంగనూరుకు చెందిన సుజయ్‌కుమార్ వారి ఇంటి సమీపంలో ఉండే బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలికతండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే రెండు రోజులుగా పోలీసులు కేసు నమోదు చేయకుండా రాజీ చేసుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు. దీనిపై పత్రికల్లో వార్తలు రావడం, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరగడంతో ఎస్పీ మణికంఠ ఆరా తీశారు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

సర్పదోష నివారణ పూజలు



రామకుప్పం, మే 21: రామకుప్పం పట్టణ శివార్లలోని వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం సర్పదోష నివారణ పూజలు జరిగాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. ఆలయ పురోహితులు నాగరాజశర్మ, కృష్ణమూర్తి, బాలజీలు భక్తులతో సర్పదోష నివారణ పూజలు చేయించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలు, మజ్జిగ పంపిణీ చేశారు.

టీటీడీకి 10 టన్నుల బెల్లం విరాళం

శ్రీరంగరాజపురం, మే 21: మండలంలోని మంగుంట గ్రామానికి చెందిన రైతు శేషాద్రి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన 10 టన్నుల చెరకు బెల్లంను తిరుమల తిరుపతి దేవస్థానానికి మంగళవారం విరాళంగా పంపించారు. ఈ బెల్లం లారీని డీపీఎం వాసు, మార్క్‌ఫెడ్ రమేష్‌లు జెండా ఊపి ప్రారంభించారు. డీపీఎం వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుప్రసాద్, మంగుంట రైతులు పాల్గొన్నారు.

వైభవంగా కోయిల్ అల్వార్ తిరుమంజనం

కార్వేటినగరం, మే 21: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయంలో కోయిల్ అల్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని వేద పండితులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో ఈకార్యక్రమాన్ని తిలకించారు. ఆలయాధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

భక్తులకు మజ్జిగ పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పీపీఎస్ నాయకులు

పలమనేరు, మే21 : పలమనేరు గంగమ్మ జాతరకు వివిధ ప్రాంతాలనుంచి వచ్చే భక్తులకు స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గాండ్ల సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు భక్తులకు చల్లటి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ముందు భక్తులకు రిక్రియేషన్ క్లబ్ మజ్జిగ పంపిణీ చేసింది.

రేపటి నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

రొంపిచెర్ల, ఏప్రిల్ 20: వేరు శెనగవిత్తన కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు ఆయా రైతు భరోసా కేంద్రంలోనే గురువారం నుంచి విత్తనకాయలు పంపిణీ చేస్తారని మండల ఏఈవో శ్రీనివాస్ తెలిపారు. ఇంతవరకు నమోదు చేసుకోని వారు ఈ రెండు రోజుల్లో నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు.

నంజంపేట గంగ జాతరకు చాటింపు

సోమల, మే 21: మండలంలోని నంజంపేటలో గంగ జాతర నిర్వహణకు మంగళవారం చాటింపు వేశారు. ఇందులో భాగంగానే నడివీధిలో గ్రామస్థులు పూజలు జరిపారు. ఈ నెల 28 మంగళవారం అమ్మవారిని ప్రతిష్ఠించి పూజలు చేయనున్నారు. వారం రోజుల పాటు బలిపోతుకు ఇంటింటా పూజలు, చల్లకుండల ఊరేగింపులు జరుప నున్నారు. కాగా సోమల గంగజాతరను నంజంపేట జాతర అనంతరం జూన్ 4 నుంచి నిర్వహించాలని గ్రామపెద్దలు నిర్ణయించారు.

కందూరులో పోలీసు పికెటింగ్



సోమల, మే 21: మండలంలోని కందూరు మేజర్ పంచాయతీలో ఏర్పాటు చేసిన పోలీసు పికెటింగ్‌ను మంగళవారం ఎస్ఐ వెంకట నరసింహులు పరిశీలించారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా కందూరులో వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణ జరిగి రెండు కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో మళ్లీ ఘర్షణలు జరగకుండా ఉండేందుకు పికెటింగ్ ఏర్పాటు చేశారు.

మార్కెట్ యార్డు కన్వీనర్‌గా ప్రభాకర్

పెద్దపంజాణి, మే 21: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా చిత్తూరు జిల్లా మార్కెట్ యార్డు కన్వీనర్‌గా పెద్దపంజాణి మండలం వీఏ.కొత్తూరు గ్రామానికి చెందిన ప్రభాకర్ నియమితులయ్యారు. మంగళవారం ఈ మేరకు జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు జాగర్లమూడి చంద్రశేఖర్ నాయుడు నియా మకపు ఉత్తర్వులు అందజేశారు. ప్రభాకర్‌ను పెద్దపంజాణి మండల బీజేపీ నాయకులు వెంకట్రమణ, రమణ, డాక్టర్ రామచంద్ర, మునస్వామి తదితరులు అభినందించారు.

స్ట్రాంగ్ రూములను పరిశీలించిన ఎస్పీ

చిత్తూరు, మే 21: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మంగళవారం చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. వర్షాల కారణంగా స్ట్రాంగ్‌రూముల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. వర్షపు నీరు స్ట్రాంగ్‌రూముల్లోకి వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఏఎస్పీ అరీఫుల్లా, ఏఆర్ డీఎస్పీ మహబూబ్ బాష, ఆర్ఐ నీలకంఠేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మా.. కరుణించ రావమ్మా!

● కుప్పంలో జాతర వైభవం


ఊరేగుతున్న గంగమ్మ శిరస్సు


గంగమ్మ ముందు సాగిన పచ్చిగరిగె

కుప్పం, మే 21: కుప్పంలో గంగమ్మ శిరస్సు ఊరేగింపు వైభవోపేతంగా సాగింది. డప్పుల మోతలు, మంగళ తూర్యారావముల మధ్య అమ్మవారు కదలి వస్తుంటే భక్తజనం పులకలెత్తింది. అమె దివ్యమైన ఉగ్రరూపాన్ని దర్శించి, గగుర్పాటు చెందుతూనే సాగిలబడి మొక్కింది. జంతు బలులు సమర్పించి మొక్కులు తీర్చుకుంది. మళ్లీ వచ్చేయేడు వరకూ చల్లంగా కావమని కోరి, మరో మారు అమ్మకు ముడుపులు కట్టి తిరిగి వెళ్లింది. మూడు రాష్ట్రాలనుంచి పోటెత్తిన జనంతో కుప్పం పోటెత్తింది.

కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ ఊరేగింపు మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. తొలుత ఉదయం చెరువు కట్టమీద గల గంగబావి దగ్గర నుంచి గంగమ్మ అమ్మవారి శిరస్సు ఊరేగింపు ప్రారంభమైంది. డప్పుల శబ్దాలు మంగళవాయిద్యాలు శ్రావ్యంగా మోగుతుంటే గంగమ్మ నామస్మరణతో కుప్పం మార్మోగింది. ఉదయం మొదలైన అమ్మవారి శిరస్సు ఊరేగింపు అర్ధరాత్రి దాటేకా కొనసాగి, చివరకు ఆలయం చేరుకుంది.


కుప్పం గంగజాతరలో పోటెత్తిన భక్తజనం

● **రక్తసిక్తమైన వీధులు:** అమ్మవారి శిరస్సు ఊరేగింపునకు ముందు బారులుతీరిన భక్తజనం జంతు బలులిచ్చి ఆమెకు మొక్కులు తీర్చుకుంది. ఎక్కడికక్కడ తెగిప డుతున్న జంతువుల నుంచి చిందిన రక్తంతో వీధులు ఎరుపెక్కాయి.

● **మూడు రాష్ట్రాలనుంచి పోటెత్తిన భక్తజనం:** కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబకు ఒక్క కుప్పం, ఆంధ్రాలోనే కాదు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో కూడా భక్తులు అధిక సంఖ్యలోనే ఉన్నారు. ప్రతి ఇంటిలోనూ జాతరకోసం బంధువులు రెండుమూడు రోజుల ముందుగానే దిగిపోయారు. ప్రతి ఇల్లూ పెళ్లి ఇంటిని తలపించింది. మాంసాహార వంటకాల ఘుమఘుమలతో పరిసరాలు గుమ్మెత్తాయి. ఇతర ప్రాంతాలనుంచి ట్రాక్టర్లు, వ్యాన్లు, ఇతర వాహనాలపై కుటుంబాల సమేతంగా లేదా ఊరూరూ తరలివచ్చి అమ్మవారికి జంతు బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎక్కడికక్కడ టెంట్లు వేసుకుని, మాంసాహార వంటకాలు వండి, తాము తిని, ఇతర భక్తులకు సైతం వడ్డించారు.

● **తగ్గిన దుకాణాలు:** ప్రతియేటా గంగమాంబ జాతరకు ఇతర ప్రాంతాలనుంచి రకరకాల దుకాణాలు కుప్పం తరలి వచ్చేవి. అటు ప్యాలస్ రోడ్డు, ఇటు నేతాజీ రోడ్డు, బైపాస్ లింక్ రోడ్డులు మొత్తం ఈ దుకాణాలతో నిండిపోయేవి. కానీ ఈసారి దుకాణాల సంఖ్య తగ్గింది. కొద్దిగా మాత్రం దుకాణాలు, కొన్నిరకాల వస్తువులు, సంబారాలతో ఏర్పడ్డాయి. ఈ దుకాణాలలోనే పిల్లాపాపా తమకు కావాల్సిన ఆట వస్తువులు, మహిళలు వంటపాత్రలు, ఇతర వస్తువులు కొనుగోలు చేశారు.

నేడు కుప్పం గంగమ్మ విశ్వరూప దర్శనం

కుప్పం, మే 21: ప్రసన్న గంగమాంబ జాతరలో భాగంగా బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం జరగనుంది. ఏడాది పొడవునా శిరస్సులేని మొండెంతో తెర వెనుకనే ఉండిపోయిన అమ్మవారు, ఈ జాతర వారం రోజులుగా తెర ముందుకు వచ్చి శిరస్సు భాగంలో వేప మండలు ధరించి పూజలందుకున్నారు. చివరి రోజైన బుధవారం అమ్మవారు సంపూర్ణ విశ్వరూపంతో భక్తులను కరుణిస్తారు. మంగళవారం అర్ధరాత్రి దాకా సాగిన అమ్మవారి శిరస్సు ఆపైన ఆలయాన్ని చేరు కుంటుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రత్యేక శాంతిపూజలు నిర్వహిస్తారు. అనంతరం శిరస్సును అమ్మవారి అసంపూర్ణ దేహంపై జాగ్రత్తగా అమరుస్తారు. తర్వాత పూమాలలు, స్వర్ణాభరణాలతో అలంకరించి, విశేష పూజలు జరుపుతారు. అమ్మవారి ఉగ్రరూపం వల్ల ఎటువంటి హాని కలగరాదని ఈ పూజలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అమ్మవారు విశ్వరూప దర్శనమిస్తారు.

కోలాహలంగా గంగమ్మ జాతర



గంగమ్మ సేవలో మాజీ మంత్రి అమర్, బోనాలతో భక్తులతో కలిసి వస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పవిత్ర

పలమనేరు, మే21 : పలమనేరులో గంగమ్మ జాతర కోలాహలంగా జరుగుతోంది. సోమవారం అర్ధరాత్రి పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయం నుంచి గంగమ్మ శిరస్సును అలంకరించి ఎంబీటీరోడ్డు, జవుళివీధి, బజారువీధి, గంగమ్మ గుడి వీధుల గుండా ఊరేగించారు. మంగళవారం తెల్లవారు జామున గంగశిరస్సును ఆలయంలో ప్రతిష్ఠించారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు భారీగా దర్శించుకొన్నారు. పలమనేరు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర ఆధ్వర్యంలో సత్యగంగమ్మ ఆలయం నుంచి బోనాలు, అగ్నిగుండాలతో పెద్ద సంఖ్యలో భక్తులు బయలు దేరి గంగమ్మ గుడివద్దకు చేరుకొని మొక్కులు చెల్లించుకొన్నారు. మాజీ మంత్రి అమరనాథ రెడ్డి టీడీపీ నాయకులతో కలిసి వచ్చి గంగమ్మను దర్శించుకొన్నారు. అంతకు ముందు అమరనాథరెడ్డి మారెమ్మను దర్శించుకొన్నారు. ఆలయ ఈవో కమలాకరరావు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు సీఆర్.రాజన్, నాయకులు ఆర్వీబాలాజీ, ఆర్‌బీసీ కుట్టి, గిరిబాబు, ఖాజా, సుబ్రమణ్యంగౌడు, నాగరాజు, మదన్‌మోహన్, శ్రీధర్, క్రిష్ణమూర్తి, కిరణ్, పాల్గొన్నారు.

బాణసంచా, డ్రమ్ములు లేకుండా : సాధారణంగా గంగమ్మ శిరస్సు ఊరేగింపులో పెద్దసంఖ్యలో బాణసంచా కాల్చడంతో పాటు డీజే సౌండ్లు, డ్రమ్స్ వాయిద్యాలు ఉండేవి. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ఈ ఏడాది వాటిని నిషేధించారు. దీంతో జాతర ప్రశాంతంగా సాగింది. ఇక శిరస్సు ఊరేగింపు సమయంలో వీధుల్లో భక్తులు జంతుబలులు సమర్పించారు. కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు పట్టారు. కొబ్బరి చిప్పలను సేకరించుకొనేందుకు ఇతర ప్రాంతాలనుంచి మహిళలు, యువకులు తరలివచ్చారు.

భారీబందోబస్తు : జాతర ప్రశాంతంగా నిర్వహించేందుకు పలమనేరు సబ్‌డివిజన్‌లోని పోలీసు స్టేషన్‌ల నుంచి సిబ్బందిని తరలించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు.

నేడు గంగమ్మ జలధి ఉత్సవం :

బుధవారం ఉదయం అమ్మవారి శిరస్సును బజారువీధిగుండా గాంధీనగర్ చివర ఉన్న వ్యవసాయబావి వద్దకు తీసుకెళ్లి అక్కడ జలధిలో కలుపుతారు. దీంతో గంగమ్మజాతర ముగుస్తుంది.

గెలిచేది మనమే: చల్లా రామచంద్రారెడ్డి


రొంపిచెర్లలో టీడీపీ నాయకులతో చల్లారామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 21: రాష్ట్రంలో గెలిచి అధికారంలోకి రాబోయేది మనమేనని పుంగనూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి తెలియజేశారు. మంగళవారం రొంపిచెర్లలోని తన నివాసంలో సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. బూత్‌ల వారీ ఓటింగ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ విజయం కోసం శక్తి వంచనలేకుండా పనిచేశారని నాయకులను, కార్యకర్తలను అభినందించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఉయ్యాలరమణ, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు సహదేవ, అబూబకర్, మెకానిక్ రఫీ, మాజీ ఎంపీటీసీ అమరనాథరెడ్డి, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, దుస్సా వెంకట్రమణ, వెంకట్రమణ, శ్రీనివాసులురెడ్డి, రఘునాథరెడ్డి, శివశంకర, సోమల మణి, సుబ్రమణ్యం, మల్లికార్జున పాల్గొన్నారు.

నంజంపేట రోడ్డులో ప్రయాణమంటే హడల్



సోమల, మే 21: సోమల నుంచి నంజంపేట, పెద్దఉప్పరపల్లె రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఆరోడ్డులో ప్రయాణించాలంటే హడలిపోతున్నారు. సోమల నుంచి అడుసుపల్లె, సరస్వతీపురం, నంజంపేట వరకు రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. వర్షపు నీటితో గుంతలు నిండిపోవడంతో వాహనదారులకు గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదు. దీంతో వాహనాలు గుంతల్లో దిగడంతో ప్రయాణికులు అదిరిపడుతున్నారు. పెద్ద ఉప్పరపల్లెవరకు 14 కిలోమీటర్ల దూరం సింగిల్ రోడ్డు అధ్వానంగా ఉంది. సోమల సచివాలయం వద్ద రోడ్డుపై గుంతలు ఉండడంతో కొద్దిపాటి వర్షంతోనే చెరువును తలపిస్తుంది. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అశ్వ వాహనంపై మృత్యుంజయేశ్వరుడి విహారం



చౌడేపల్లె, మే21: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో 9వ రోజు అశ్వ వాహనంపై మృత్యుం జయేశ్వర స్వామి ఊరేగారు. మంగళవారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామివారి ఉత్సవ మూర్తులను అధిష్ఠింప చేసి ప్రత్యేకంగా పూలతో, ప్రభలతో, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, చెక్కభజనలు, కోలాటాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు కర్పూర హారతులు సమర్పించారు. ఉభయదారులుగా అన్నం వంశస్తులు వ్యవహరించారు.

చల్లగా చూడమ్మా...విరూపాక్షమ్మా



విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు, బోణాలు తీసుకొస్తున్న భక్తులు

కల్లూరు, మే 21: పులిచెర్ల మండలం కల్లూరులో కొలువైన విరూపాక్షమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం వైభవోపేతంగా జాతర నిర్వహించారు. ఆలయంలో మంగళవారం వేకువజామున భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేకపూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు తీసుకొచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. విశేషాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నదానాలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు అన్నిఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు


క్షతగాత్రురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న సహచరులు, స్థానికులు

కల్లూరు, మే 21: పులిచెర్ల మండలం కల్లూరులోని జాతీయ రహదారిపై మంగళవారం ఆటో కారు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. తవణంపల్లి మండలం మత్తురపల్లికి చెందిన కొందరు మహిళలు కోలాట బృందంగా ఏర్పడి సోమవారం సాయంత్రం పీలేరు మండలంలోని ఓ జాతరలో ప్రదర్శన ఇచ్చారు. మంగళవారం ఉదయం స్వగ్రామానికి ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. కల్లూరులో వీరి ఆటో, మరో కారు ఢీకొన్నాయి. ఆటోలో ఉన్న హైమావతి కుడికాలికి, కుడిచేయికి తీవ్రగాయాలయ్యాయి. ఆమెను కల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం 108లో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గంగమ్మ నిమజ్జనం సందర్భంగా
ట్రాఫిక్ మళ్లింపు

చిత్తూరు, మే 21: నడివీధి గంగమ్మ నిమజ్జనం సందర్భంగా బుధవారం నగరంలో ట్రాఫిక్ మళ్లింపు జరుగుతుందని చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాకు వివరించారు.

● భారీ వాహనాలు చిత్తూరు నగరంలోకి రాకుండా.. రెడ్డిగుంట జంక్షన్ నుంచి ఇరువారం, కాణిపాకం, మురకంబట్టు, కట్టమంచి, సాంబయ్య కండ్రిగ జంక్షన్ల మీదుగా వెళ్లాలి. ● వేలూరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రెడ్డిగుంట జంక్షన్ నుంచి ఇరువారం, కాణిపాకం, మురకంబట్టు, ఎల్‌జీబీ టవర్స్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు మళ్లించారు. ● పలమనేరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను ఇరువారం జంక్షన్ నుంచి కాణిపాకం, మురకంబట్టు, ఎల్‌జీబీ టవర్స్ మీదుగా ఆర్టీసీ బస్టాండుకు రావాలి. ● పుత్తూరు నుంచి వచ్చే ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు.. సాంబయ్యకండ్రిగ జంక్షన్ నుంచి కట్టమంచి, ఎల్‌జీబీ టవర్స్ మీదుగా ఆర్టీసీ బస్టాండుకు వెళ్లాలి. వేలూరు నుంచి వచ్చే ప్రైవేటు బస్సులకు రెడ్డిగుంట జంక్షన్ వరకు మాత్రమే అనుమతి. అలాగే పలమనేరు నుంచి వచ్చే ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలకు ఇరువారం వరకు మాత్రమే. ● కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలకు ఎల్‌జీబీ టవర్స్, దర్గా జంక్షన్, కోర్టు జంక్షన్, ఆర్టీసీ బస్టాండ్ వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ● ట్రాఫిక్ మళ్లింపు బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి గంగమ్మ నిమజ్జనం పూర్తయ్యేంత వరకు అమలులో ఉంటుంది. ప్రజలు ఈ మార్పును గమనించి సహకరించాలని డీఎస్పీ కోరారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎస్పీ



చిత్తూరు, మే 21: చిత్తూరు ప్రజలకు ఎస్పీ మణికంఠ చందోలు గంగమ్మ జాతర శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర నిర్వాహకులు ఆయనకు పూలమాల వేసి ప్రసాదాలను అందించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాతర జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందని, పట్టణ ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల ప్రయాణికులు కూడా సహకరించాలని కోరారు. భక్తులకు ఏదైనా సమస్యలు ఎదురైతే సమీపంలో ఉన్న పోలీసులకు లేదా డయల్ 100కు లేదా వాట్సాప్ నెంబరు 94409 00005 నెంబరకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి



శ్రీపెరంబదూరులో రాజీవ్‌గాంధీ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న నగరి కాంగ్రెస్ నాయకులు

నగరి, మే 21: దివంగత నేత, మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నగరి కాంగ్రెస్‌పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. నగరి టవర్‌క్లాక్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరంరం పీసీసీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు రాకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరి కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా తమిళనాడులోని శ్రీపెరంబదూరుకు వెళ్లి అక్కడ రాజీవ్‌గాంధీ సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి దేశాభివృద్ధి కోసం కృషి చేశారని రాకేష్‌రెడ్డి కొనియాడారు. పీసీసీ ప్రధానకార్యదర్శి బాబు, పీసీసీ సభ్యులు నటరాజమొదలియార్, సుధాకర్‌రాజు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఢిల్లీ, ప్రధానకార్యదర్శి దేశయ్య, నాయకులు చిరంజీవిరెడ్డి, దేశప్పన్, కుమార్, గిరి, రత్నం, అజిత్ మహ్మద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

కార్వేటినగరం, మే 21: రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక వృద్ధాశ్రమంలోని వృద్ధులకు మంగళవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి గోవర్ధన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దినకర ప్రసాద్, కాంగ్రెస్ సేవాదళ్ మాజీ అధ్యక్షుడు గౌతమ్ రాజు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణ జిల్లా పర్యవేక్షణాధికారిగా వెంకటరెడ్డి

చిత్తూరు (సెంట్రల్), మే 21: ఇళ్ల నిర్మాణాల జిల్లా పర్యవేక్షణాధికారిగా కె.వెంకటరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో చిత్తూరు జిల్లా హౌసింగ్ పీడీగా పనిచేసి ఈయన పదవీ విరమణ అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖలో కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద రాష్ట్రంలో పేదలకు మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాన్ని సకాలంలో పూర్తి చేయకపోవడాన్ని కేంద్రం సీరియస్‌గా తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఆయా జిల్లాలో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేలా పర్యవేక్షించడానికి సీనియర్‌లను పర్యవేక్షణాధికారులుగా నియమిస్తూ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ పీఎస్ గిరీశ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి, గుంటూరు జిల్లాల పర్యవేక్షణాధికారిగా సీనియర్ అధికారి వెంకటరెడ్డిని నియమించారు. సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ముగియగానే ఆయన జిల్లాకు రానున్నారు.

జిల్లా క్రీడా భారతి కమిటీ అధ్యక్షుడిగా మునికృష్ణయ్య

వెదురుకుప్పం, మే 21: జిల్లా క్రీడా భారతి నూతన కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ పి.మునికృష్ణయ్య ఎన్నికయ్యారు. మంగళవారం వెదురుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా క్రీడా భారతి నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికకు అబ్జర్వర్‌గా ఏపీ క్రీడా భారతి నుంచి ధనుంజయరెడ్డి హాజరయ్యారు. కార్యదర్శిగా కృష్ణయ్య, కోశాధికారిగా మైత్రిలోకసుందరి, ఉపాధ్యక్షులుగా బాబు, లక్ష్మి, పరమాత్మయ్య, రవీంద్రరెడ్డి ఎన్నికయ్యారు. మిగతా కమిటీని ఎన్నుకున్నామని ధనుంజయరెడ్డి తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి





చిత్తూరు నడివీధి గంగమ్మ తల్లి విశ్వరూపానికి మంగళహారతి ఇస్తున్న సీకే బాబు కుటుంబం - గిరింపేటలో, మంగళసముద్రంలో కొలువుదీరిన గంగమ్మ



దొడిపల్లెలో ఇంటింటికీ బయల్దేరిన నడివీధి గంగమ్మ




కట్టమంచిలో కొలువుదీరిన నడివీధి గంగమ్మ, సంతపేట గంగమ్మ సేవలో భూపేష్ గోపీనాథ్

పాహిమాం.. పాహిమాం.. గంగమ్మ తల్లీ

● వాడవాడలా వైభవంగా జాతర ఉత్సవాలు
● చిత్తూరు నడివీధి గంగమ్మకు తొలి పూజలు చేసిన సీకే బాబు దంపతులు

చిత్తూరు కల్చరల్, మే 21: పాహిమాం.. పాహిమాం.. గంగమ్మ తల్లీ అంటూ మంగళవారం చిత్తూరు నగరంలో వాడవాడలా భక్తులు గంగమ్మ జాతరలు ఘనంగా నిర్వహించారు. నడివీధి గంగజాతరను వంశ పారంపర్య ధర్మకర్తలు సీకే బాబు దంపతులు తొలి పూజలు చేసి ప్రారంభించారు. అలాగే, సంతపేట నడివీధి గంగమ్మ జాతరను ఉత్సవ ధర్మకర్త భూపేష్ గోపీనాథ్, గిరింపేట జాతరను డిప్యూటీ మేయర్ ఆర్.సి.చంద్రశేఖర్, మంగసముద్రం, ఓబనపల్లె, మంగసముద్రం హౌసింగ్ కాలనీల్లో జ్ఞానజగదీశ్, దొడిపల్లెలో దళవాయి శివకుమార్, ఎల్.జి.తిరుకుమరన్, కొంగారెడ్డిపల్లెలో చిత్తూరు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి, ఆపార్టీ నేత రాజేష్‌కుమార్‌రెడ్డి, మురకంబట్టులో నవీన్, ప్రశాంత్‌నగర్ కాలనీలో ఉత్సవ ధర్మకర్తలు రామచంద్ర, స్క్రాబ్ రమేష్‌లు అమ్మవార్లకు తొలి పూజలు చేసి జాతర మహోత్సవాలను ప్రారంభించారు. జాతర్ల సందర్భంగా డి.ఐ.రోడ్డులోని లారీబాబు కార్యాలయం, పొన్నియమ్మ ఆలయం, బజారు వీధుల్లో చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు అన్నదానం చేశారు. గొడుగుమూరు గ్రామస్తులు మంగళవారం సాయంత్రం సామూహికంగా గ్రామ సరిహద్దులో తోపు గంగమ్మకు పొంగళ్లు పెట్టి పూజలు చేశారు. బుధవారం సాయంత్రం నగరంలో నడివీధి గంగమ్మలకు జలనివాస కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నారు.







కొంగారెడ్డిపల్లెలో పూజలందుకుంటున్న గంగమ్మ, శంకరయ్యగుంటలో అమ్మవారి గెరిగను ఊరేగిస్తున్న భక్తులు, లారీఓనర్స్ సంఘ కార్యాలయం వద్ద అన్నదానం చేస్తున్న సీకే బాబు, తనయుడు సాయికృష్ణారెడ్డి, నగరిలో విశేష అలంకరణలో గంగమ్మ తల్లి, పూతలపట్టులో అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న కార్యనిర్వాహకులు జగదీశ్వర్ రెడ్డి

మొక్కులు తీర్చుకున్న భక్తులు

నగరి, మే 21: మండల పరిధిలోని వీకేఆర్‌పురంలో గంగజాతర వేడుకలు వైభవంగా జరిగాయి. మంగళవారం గ్రామస్తులు అమ్మవారికి అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టి దూప దీప నైవేద్యాలతో మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అమ్మవారిని విశేషాలంకరణతో పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు హారతులతో కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గంగాధరనెల్లూరు: మండలంలో గంగాధరనెల్లూరు దళితవాడ, వేల్కూరు, ఎం.నాశంపల్లె, పెద్దకాల్వ, ఎన్‌టీఆర్ (రాజా) కాలనీ, చెర్లోపల్లె దళితవాడ, వేల్కూరు దళితవాడ, రామానాయుడుపల్లె దళితవాడ, కడపగుంట దళితవాడల్లో ఏర్పాటుచేసిన గంగమ్మకు పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజల అనంతరం ప్రజలకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గంగాధరనెల్లూరు అల్లియెల్లమ్మ గుడి వద్ద దిగవూరుకు చెందిన ప్రజలు, ఎగవూరులో సత్యమ్మ రాయివద్ద మహిళలు అంబళ్ళు పోసి పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



గంగాధరనెల్లూరు దళితవాడలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న గంగమ్మ

పాలసముద్రం: మండలంలోని తిరుమలరాజుపురం, ఎగువ వనదుర్గాపురం గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతరను వైభవంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉదయం మహిళలు అంబళ్ల పోశారు. సాయంత్రం పొంగళ్ళు పెట్టారు. అమ్మవారి మట్టి విగ్రహాన్ని ఏర్పాటుచేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, సాయంత్రం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గ్రామాల్లో విద్యుద్దీపాలతో అలంకరించి, అమ్మవారి కటౌట్లను ఏర్పాటు చేశారు. రాత్రికి వీధినాటకాలు ప్రదర్శించారు.

పెనుమూరు: మండలంలోని ఉగ్రాణంపల్లిలో ముత్తిగంగమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ మురళీకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. బుధవారం అమ్మవారి నిజరూప దర్శనం, రాత్రి ఊరేగింపు జరుగుతుంది. ప్రవీణ్, గుణశేఖర్‌రెడ్డి, ధనంజయరెడ్డి, హరిబాబు, రాజేష్, రవి, కనకరాజ్, జగపతి, రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతరను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 197 రామాపురంలో గంగమ్మకు ప్రత్యేక అభిషేకాలు చేసి, పూజలు నిర్వహించారు. అమ్మవారిని గెరిగ రూపంలో ప్రతిష్ఠించి అంబళ్ల పోశారు. రాత్రి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి, పురవీధుల్లో మంగళవాయిద్యాల మధ్య బాణసంచా వేడుకలతో ఊరేగింపు నిర్వహించారు. కోలావూరులో ఉన్న అమ్మవారికి వేపాకుతో పూజలు నిర్వహించి అంబళ్ళు పోసి మొక్కుబడులను తీర్చుకున్నారు.

పూతలపట్టు: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం గంగమ్మ జాతర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన పూతలపట్టులో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి కార్యనిర్వాహకులు పూతలపట్టు జగదీశ్వర్‌రెడ్డి తొలిపూజతో ఉత్సవ వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం అమ్మవారికి మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

నిమ్మకాయపై గంగమ్మ చిత్రం



యాదమరి, మే 21: చిత్తూరు నడివీధి గంగమ్మ జాతర సందర్భంగా యాదమరి ఉన్నత పాఠశాల డ్రాయింగ్ మాస్టర్ దామోదరాచారి ప్రత్యేకంగా నిమ్మకాయపై గంగమ్మ చిత్రాన్ని చిత్రీకరించారు. ప్రత్యేక సందర్భాల్లో ఈయన వైవిధ్యమైన చిత్రాలను రూపొందించడం విశేషం. గతంలో వేపాకు, టెంకాయపై గంగమ్మ చిత్రాలను చిత్రీకరించి ఆకట్టుకున్నారు. ఈ ఏడాది అమ్మవారికి ఎంతో ప్రీతిపాత్రమైన నిమ్మకాయపై గంగమ్మను చిత్రీకరించడం సందర్భోచితంగా ఉండటం విశేషం.

సుబ్రహ్మణ్యస్వామికి
మొక్కులు తీర్చుకున్న భానుప్రకాష్



నగరి మే 21: నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్శనానికి వెళ్లిన ఆయనకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయనతోబాటు టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజీ, టీడీపీ యువత అధ్యక్షుడు చిట్టిబాబు, నాయకులు చిత్తూరుబాబు, మాణిక్యవాసన్, మదివన్నన్, కర్ణ, జయచంద్ర నాయుడు తదితరులు ఉన్నారు.

టీటీడీకి 10 టన్నుల బెల్లం విరాళం



బెల్లం లారీని జెండా ఊపి పంపిస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం, మే 21: మండలంలోని మంగుంట గ్రామానికి చెందిన రైతు శేషాద్రి ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన 10 టన్నుల చెరకు బెల్లంను తిరుమల తిరుపతి దేవస్థానానికి మంగళవారం విరాళంగా పంపించారు. ఈ బెల్లం లారీని డీపీఎం వాసు, మార్క్‌ఫెడ్ రమేష్‌లు జెండా ఊపి ప్రారంభించారు. డీపీఎం వాసు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుప్రసాద్, మంగుంట రైతులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

బంగారుపాళ్యం, మే 21: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద మంగళవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి నలగాంపల్లెకు చెందిన ఎస్‌పీ భార్గవి, పవన్ కుమారుడు నిష్ జన్మదినాన్ని పురస్కరించుకుని భోజనం వితరణ చేశారు. ఎస్‌పీ ధరణీ నాయుడు, జనార్దన్ గౌడ్, శ్రీనివాసులు నాయుడు, రమేష్, హరిప్రసాద్, శివ పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె వైద్య శిబిరం

యాదమరి, మే 21: సుచి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జోడిచింతల వద్ద ఉన్న సుచి సంస్థలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్, ఈసీజీ, ఎకో పరీక్షలను కూడా ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు.

సచివాలయాల్లో సిబ్బంది ఏరీ..

● ఫీల్డ్ పేరుతో విధులకు డుమ్మా

పెనుమూరు, మే 21: గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఒక్కో సచివాలయంలో కనీసం 9 మంది సిబ్బందిని నియమించింది. ఎన్నికల హడావిడిలో సుమారు రెండు నెలలుగా సచివాలయంలో సిబ్బంది ఎవరు పనిచేస్తున్నారు.. ఎవరు వస్తున్నారో అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. ఎన్నికలు ముగిసి పది రోజులు అవుతున్నా ఇంకా సచివాలయాల్లో సిబ్బంది లేక బోసిపోతున్నాయి. మంగళవారం మండలంలోని తాటిమాకులపల్లి, చార్వాగానిపల్లి సచివాలయాలను ఆంధ్రజ్యోతి విజిట్ నిర్వహించింది. తాటిమాకులపల్లి సచివాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు ఎంఎల్‌హెచ్‌పీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్ పైన గదిలో నిద్రిస్తూ సేద తీరుతున్నాడు. మరో ఉద్యోగిని తలుపులు లాక్ చేసి నిద్రిస్తుంది. చార్వాగానిపల్లి సచివాలయంలో వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్, మహిళా పోలీస్ మాత్రమే ఉన్నారు. మిగిలిన వారి గురించి అని అడిగితే ఫీల్డ్‌కి వెళ్లారని సమాధానం చెప్పారు. మండలంలోని గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న పలువురు సిబ్బంది ఫీల్డ్ పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు సచివాలయాలపై పర్యవేక్షణ సాగించి సిబ్బంది ద్వారా ప్రజలకు సేవలందించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అదేవిధంగా సర్వేయర్లు రీసర్వే మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు సచివాలయాల్లో అందుబాటులో లేరు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత రీసర్వే నిలిపేశారు. అయినా వారు సచివాలయాల్లో అందుబాటులో లేకపోవడం గమనార్హం.



సచివాలయంలో నిద్రపోతున్న సిబ్బంది

విధుల్లో అలసత్వం వహించిన వారిపై చర్యలు
- ఎంపీడీవో వెంకటేశ్వరరావు

గ్రామ సచివాలయ సిబ్బంది సమాచారం ఇవ్వకుండా, మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయకుండా సచివాలయంలో లేనివారిపై చర్యలు తీసుకుంటాం. విధుల్లో అలసత్వం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, వారి జీతాలను నిలిపివేస్తాం.


గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి

తవణంపల్లె, మే 21: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఏవో ప్రవీణ్ మాట్లాడుతూ ఖరీఫ్ సాగు కోసం రాయితీపై అందించే వేరుశనగ విత్తన కాయలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, ఈ నెల 23 నుంచి రైతులకు పంపిణీ చేస్తామన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రతి గురువారం మండలంలోని సచివాలయాల పరిధిలో బీసీజీ వ్యాక్సిన్ వేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి నవీన్‌కుమార్ కోరారు. అనంతరం వివిధ శాఖల వారిగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ భారతి, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తూతూమంత్రంగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారిణి సాగరిక

బంగారుపాళ్యం, మే 21: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అమరావతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా జరిగింది. విద్య, వైద్యం, వ్యవసాయంపై నామమాత్రంగా సమీక్షించారు. ఈ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు ఎలాంటి సమస్యల గురించి చర్చించకుండానే సంతకాలు చేసి మమ అనిపించారు. దీంతో సర్వసభ్య సమావేశాన్ని ముగించినట్లు ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు శిరీష్ రెడ్డి, జయకుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కార్వేటినగరం, మే 21: కార్వేటినగరం టీటీడీ వేణుగోపాలస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని వేద పండితులు మంగళవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని ఈకార్యక్రమాన్ని తిలకించారు. ఆలయాధికారి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

కార్వేటినగరం, మే 21: కార్వేటినగరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య వైద్య కేంద్రాన్ని జిల్లా ప్రభుత్వ టీకాల అధికారి డాక్టర్ రవిరాజు మంగళవారం తనిఖీ చేశారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు బీసీజీ వ్యాక్సిన్ వేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఆయన డాక్టర్లకు సూచించారు. ప్రభుత్వ డాక్టర్లు ఆనందమూర్తి, గోపీనాథ్, కీర్తి పాల్గొన్నారు.

ఈసీకి సిట్ ఇచ్చిన నివేదిక అంతా డొల్ల

● టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, మే 21: కేంద్ర ఎన్నికల సంఘానికి సిట్ ఇచ్చిన నివేదిక అంతా డొల్లగా ఉందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన హింసపై ఈసీకి సిట్ ఇచ్చిన నివేదికపైన ప్రజలకు నమ్మకం కలగలేదని చెప్పారు. సిట్ బృందం కేవలం రెండు రోజుల్లో తూ తూ మంత్రంగా విచారణ జరిపి ఇచ్చిన నివేదికలో నిజం ఎంతుందో అర్థం కాక ప్రజలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. చంద్రగిరి, పల్నాడు, అనంతపురం, విశాఖపట్నంలో జరిగిన హింసాత్మక ఘటనలపై కేవలం రెండు రోజుల్లో ఇచ్చిన నివేదిక నమ్మశక్యంగా లేదన్నారు. సుమారు 1370 మందిపైన కేసులు నమోదుచేస్తే అరెస్టు చేసింది కేవలం 124 మందినేనని చెప్పారు. ఇప్పటికీ 1152 మందిని అరెస్టు చేయలేదన్నారు. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో సిట్ ఏర్పాటు చేసి విచారణ జరిపించాలని సప్తగిరి ప్రసాద్ డిమాండ్ చేశారు.

గంగమ్మ జాతరకు పొంగళ్లు

కార్వేటినగరం, మే 21: తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకుని మండలంలోని పలు ప్రాంతాల్లో అంబలి పోసి, పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్వేటినగరం బంగారమ్మ దేవతను విశేషంగా అలంకరించారు. ఆలయ అధ్యక్షుడు ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కత్తెరపల్లెలో కూడా గంగమ్మకు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

సినేతమ్మ, అంకాళమ్మ జాతర



భక్తిశ్రద్ధలతో గెరిగలను తీసుకెళ్తున్న దృశ్యం

వెదురుకుప్పం, మే 21: వెదురుకుప్పం మండలం పాతగుంట గ్రామ పంచాయతీ మొట్టిరెడ్డికండ్రిగ గ్రామంలో ఉన్న సినేతమ్మ, అంకాళమ్మ జాతర మంగళవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గెరిగలను ఊరేగించి, ఇంటింటా కర్పూర హారతులను ఇచ్చారు.

వేరుశనగ విత్తనకాయలు పంపిణీకి సిద్ధం

గంగాధరనెల్లూరు, మే 21: రైతుల కోసం మండలంలోని వివిధ రైతుభరోసా కేంద్రాల్లో వేరుశనగ విత్తనకాయలు 6,738 బస్తాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి వందన తెలిపారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండలానికి కె6 రకం వేరుశనగ విత్తనకాయలు 6,288 బస్తాలు వచ్చాయని, ప్రభుత్వ సబ్సిడీపోనూ ఒక్కో బస్తా రూ.1,710లు, నారాయణి రకం విత్తనకాయలు 450 బస్తాలు వచ్చాయని, ఒక్కో బస్తా రూ.1,746లుగా ధర నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు ఈనెల 23వ తేదీ నుంచి ఆయా రైతుభరోసా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్‌లతో హాజరై రిజిస్ట్రేషన్ చేసుకుని డబ్బులు చెల్లించాలన్నారు. ఆ తర్వాత రైతులకు పంపిణీ చేస్తామని ఏవో పేర్కొన్నారు.